సాక్షి
నిజామాబాద్

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



అందరివాడు..

అంక్సాపూర్ సంతమల్లన్న జాతరకు వీడీసీ సర్వం సిద్ధం చేసింది. నింబాచల జాతర తరువాత రెండో పెద్ద జాతర ఇది.

- 8లో ▸



నిధులు లేక నీరసం !

స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
27.8 /7.7

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మురళి



మోర్తాడ్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన రొక్కం మురళిని నియమిస్తూ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో డైరెక్టర్‌గా కొనసాగిన సంజీవరెడ్డి దొన్కల్‌కు చెందిన వారు కావడం గమనార్హం. మరోసారి ఈ పదవి మోర్తాడ్ మండలానికే దక్కడం విశేషం. రైతుగా, సీడ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన ఉన్న మురళిని విత్తనాభివృద్ధి సంస్థకు డైరెక్టర్‌గా ఎంపిక చేయడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దేశాభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర కీలకం



నిజామాబాద్ నాగారం: దేశాభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర కీలకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను నగరంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘంలో ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిటైర్డ్ ఉద్యోగుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పడాల భోజాగౌడ్, కోశాధికారి ఆశయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ



నిజామాబాద్ రూరల్: ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని, దేశంలో ఎక్కడ ఏ విద్యార్థికి సమస్య ఉన్నా పోరాటం చేస్తోందని ఇందూర్ విభాగ్ సంఘటన మంత్రి రాజ్‌సాగర్ అన్నారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో నిర్వహించిన ఏబీవీపీ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాజ్‌సాగర్ మాట్లాడుతూ.. రెండు రోజులపాటు కొనసాగిన శిక్షణ తరగతుల్లో నాలుగు జిల్లాల విద్యార్థి ప్రతినిధులు ఎన్నో విషయాలు నేర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ ప్రముఖ్ నరేశ్, జాతీయ కార్యవర్గ సభ్యులు బి శివకుమార్, నగర అధ్యక్షుడు వెంకటకృష్ణ, ఇందూరు జిల్లా ప్రముఖ్ ఈశ్వర్, కామారెడ్డి జిల్లా ప్రముఖ్ గిరి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్ మోహన్‌గౌడ్, నాయకులు సునీల్ సాయి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలపై రాజకీయ నీడ

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక కోసం కమిటీలను నియమించాలని నిర్ణయించింది. అయితే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా, నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో మాత్రం ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. సర్వేతోపాటు కమిటీల నియామకం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను సైతం ఈనెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో కమిటీల నియామకం జాడలేకుండాపోయింది. మరోవైపు వచ్చే జనవరి 26వ తేదీతో కార్పొరేటర్ల పదవీ కాలం పూర్తి కానుంది.

- ఇందూరు మినహా జిల్లా అంతటా పూర్తయిన ప్రక్రియ
- నగరపాలక సంస్థ పరిధిలో కమిటీల ఊసే లేదు
- ఇప్పటివరకు కార్పొరేటర్లకు సమాచారమివ్వని వైనం
- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- కలెక్టర్ వద్దకు చేరిన వ్యవహారం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఏర్పాటు చేయాల్సిన కమిటీ ఏర్పాటుపై రాజకీయ నీడ కమ్ముకుంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు గత నెలలోనే పూర్తికాగా, నిజామాబాద్ నగరపాకల సంస్థ పరిధిలో మాత్రం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఏకాభిప్రామం కుదరకపోవడంతో ఆ ప్రక్రియ అడుగు కూడా ముందుకు పడడం లేదు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిజామాబాద్ అర్బన్‌లో బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఉండడంతోపాటు అత్యధిక మంది కార్పొరేటర్లు బీజేపీ వాళ్లే ఉండడంతో సయోధ్య కుదరడం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము చెప్పిన విధంగానే కమిటీలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. మరోవైపు తాను ప్రాతినిధ్యం వహిస్తున్నందున కచ్చితంగా తమ ప్రమేయం ఉండాల్సిందేనని ఎమ్మెల్యే ధన్‌పాల్ పట్టుబడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ముందుకెళ్లే విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా సహించేది లేదని ఎమ్మెల్యే ధన్‌పాల్ అంటున్నారు. దీంతో కమిటీల ఏర్పాటు విషయమై ప్రతిష్టంభన నెలకొంది. మరోవైపు తమకు ఇప్పటి వరకు అధికారులు సమాచారమే ఇవ్వలేదని కార్పొరేటర్లు అంటున్నారు. డివిజన్ కమిటీకి చైర్మన్‌గా కార్పొరేటరే వ్యవహరించాల్సిన నేపథ్యంలో అధికారులు ఇప్పటికీ తమకు చెప్పకుండా మీనమేషాలు లెక్కించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

57వేల దరఖాస్తులు

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. 60 డివిజన్‌ల పరిధిలో దరఖాస్తుదారుల వివరాల నమోదు కోసం క్షేత్ర స్థాయి సర్వే సైతం ప్రారంభించారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో 57వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. 60 డివిజన్ల పరిధిలో వివరాల సేకరణ కోసం బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో కూడిన బృందాన్ని సిద్ధం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సమగ్ర సమాచారాన్ని మొబైల్ ఫోన్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగంగా నడుస్తోంది. ఈ ప్రక్రియ తరువాత లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది.

ఇందూరు నగరపాలకంలో ఇదీ పరిస్థితి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నగరపాలక సంస్థ పరిధిలో కార్పొరేటర్లు పార్టీలు మారడంతో బలాబలాలు కొంత మారాయి. ఎన్నికల్లో బీజేపీ 28 డివిజన్‌లను గెలుచుకోగా ప్రస్తుతం ఆ పార్టీ బలం 27గా ఉంది. ఎంఐఎం గెలుచుకున్న 16 స్థానాలు అలాగే ఉన్నాయి. బీఆర్ఎస్ 12 డివిజన్‌లలో గెలవగా ప్రస్తుతం ఆ పార్టీకి ఐదుగురు కార్పొరేటర్లు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు గెలవగా ప్రస్తుతం ఆ సంఖ్య 12కు పెరిగింది. ఇద్దరు ఇండిపెండెంట్లు సైతం కాంగ్రెస్‌లోనే ఉన్నారు. బీజేపీ కార్పొరేటర్ల సంఖ్య అధికంగా ఉండడంతో ఎమ్మెల్యే ధన్‌పాల్ గట్టి పట్టుతో ఉన్నారు.

కార్పొరేటర్లు చైర్మన్‌లుగా..

కమిటీల ఎంపిక కోసం ప్రభుత్వం జీవో 7ను జారీ చేసింది. గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం విధివిధానాలు రూపొందించింది. ఏడుగురితో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నగరపాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్ చైర్మన్‌గా, వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా, మరో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి. ఐదుగురిలో ఇద్దరు మహిళా సంఘాల అధ్యక్షులు, ఒక బీసీ, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ సభ్యులు ఉండాలి. అయితే కమిటీల ఏర్పాటు కోసం ఇటీవల బదిలీ అయిన కమిషనర్ మకరందు ప్రయత్నించినప్పటికీ ముందుకు పడనివ్వలేదు.

వారాహి మాత ఆలయానికి అంకురార్పణ



అంకురార్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్, జ్ఞానేందర్ గుప్తా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలోని అమ్మ వెంచర్ రెసిడెన్షియల్ ఏరియాలో వారాహి మాత ఆలయానికి అంకురార్పణ క్రతువును ఆదివారం నిర్వహించారు. మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మంచాల జ్ఞానేందర్ గుప్తా ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. అమ్మ వెంచర్ కమిటీ బాధ్యులు పూర్తి సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. ఆలయం నిర్మించే స్థలాన్ని దున్ని ధాన్యం గింజలు చల్లారు. ఆవులను కలియతిప్పారు. బ్రాహ్మణుల వేదమంత్రోచ్చారణల మధ్య అంకుర్పాణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పరమ శివుడు స్వయంగా నిర్మించుకున్న కాశీ నగరానికి గ్రామ దేవతగా ఉన్న వారాహి మాత ఆలయాన్ని నిజామాబాద్ నగరంలో నిర్మించాని సంకల్పించడం సంతోషకరమన్నారు. వారాహిమాత కృప జిల్లా పై ఉంటుందన్నారు. వారాహి మాత ఆలయ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతానికి స్థాన బలం మరింత పెరుగుతుందన్నారు. మంచాల జ్ఞానేందర్ గుప్తా మాట్లాడుతూ.. వచ్చే ఫిబ్రవరి 10వ తేదీన ఆలయ శంకుస్థాపనకు హంపీ పీఠా ధిపతి విద్యారణ్య స్వామి రానున్నారని, కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ వెంచర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, సుదర్శన్, భానుకుమార్, జవ్వాజి దామోదర్, పోశెట్టి, శ్రీకాంత్, అయ్యప్ప దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెటూరి అందం



నిజామాబాద్ – మోపాల్ రోడ్డులో తాడెం వద్ద కనిపించిన ఈ దృశ్యం కనువిందు చేస్తోంది. పచ్చగా కళకళలాడుతున్న వరి నారుమడిలో ఓ చెట్టు మోడు వారింది. మోడు వారిన ఆ చెట్టుకు పచ్చని వరినారు కొత్తందాలను అద్దినట్లు ఉంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నిధులు మంజూరు చేయాలి



మండలంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

డొంకేశ్వర్/నందిపేట్: డొంకేశ్వర్ మండల పరిధిలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పీసీసీ నేత మహేశ్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఉమ్మడి నందిపేట

బోనస్ ఉత్సాహంతో..

- యాసంగి వరిసాగును ప్రారంభించిన అన్నదాతలు
- నాట్లు వేసేందుకు వలస వచ్చిన ఇతర రాష్ట్రాల కూలీలు



దత్తాపూర్‌లో..



డొంకేశ్వర్ మండలం తొండాకూర్ శివారులో వరినాట్లు వేస్తున్న కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఖరీఫ్ పంటకు బోనస్ అందుకున్న రైతులు ఉత్సాహంతో యాసంగి సాగుకు సిద్ధమయ్యారు. జిల్లాకు వలస కూలీల రాకతో ఇప్పటికే పలు మండలాల్లో వరినాట్లు ప్రారంభం కాగా, ముందస్తు నారు పోసిన రైతులు చకచకా నాట్లను పూర్తి చేస్తున్నారు. మిగతా వారు కూడా నాట్లు వేసేందుకు అవసరమైన పనులు మొదలుపెట్టారు. ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి భూములను దమ్ము చేస్తున్నారు. ఏ రోజు నాట్లు వేయాలో ముందుగానే కూలీలతో ఒప్పందాలు చేసుకుని, అవసరమయ్యే ఎరువులను కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. కొన్ని రోజులపాటు విశ్రాంతి తీసుకున్న అన్నదాతలు మళ్లీ సాగు పనుల్లో బిజీగా మారారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌కు 4.19 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇప్పటి వరకు 36,500 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. నెలాఖరు నాటికి నాట్లు లక్ష ఎకరాలు దాటే అవకాశముంది. ఇటు ఎరువుల కొరత రాకుండా వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు జిల్లాకు దిగుమతి చేసుకుంటోంది. సొసైటీలు, డీలర్ల వద్ద స్టాక్‌ను అందుబాటులో ఉంచి పర్యవేక్షణ చేస్తోంది. ప్రస్తుతం యూరియా 20,600 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,100 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 14,760 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3,100 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ 'సాక్షి'కి తెలిపారు.

జిల్లాకు వలస కూలీలు..

వరినాట్లు వేసేందుకు జిల్లాకు ఎప్పటిలాగే మహారాష్ట్ర, యూపీ, ఏపీ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచే కాకుండా నల్గొండ జిల్లా నుంచి కూడా వలస కూలీలు వస్తున్నారు. వారికి మధ్యవర్తులుగా ఉన్న మునీములు గ్రామాల్లో వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. వలస కూలీల్లో మహిళలు కూడా ఉండగా, మగవారికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తక్కువ సమయంలో, క్రమ పద్ధతిలో నాట్లు పూర్తి చేయడంలో వీరికి పెట్టింది పేరు. రెండు నెలల పాటు జిల్లాలోనే ఉండి నాట్లు పూర్తి చేసుకుని వెళ్తారు. అయితే ఎనిమిది నుంచి పదిమంది ఉండే కూలీల బృందానికి ఎకరం నాటు వేస్తే రూ.4,500 నుంచి రూ.4,800 వరకు రైతులు చెల్లిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశించినా కదలిక లేదు

- బాలుడి మృతి ఘటనపై విచారణ పూర్తయ్యేనా?
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యం
- జరిమానాలతో సరిపెడుతున్న అధికారులు



కిడ్స్‌కేర్ ఆస్పత్రిలో విచారణ చేస్తున్న అధికారులు(ఫైల్)

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడు మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సాక్షాత్తు కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు కదలడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా వైద్యం చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నా 'ఫైన్'లతో సరిపెడుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది మార్చిలో ధర్పల్లికి చెందిన దీక్షిత్ అనే 10 నెలల బాలుడు అస్వస్థకు గురికాగా కుటుంబ సభ్యులు నగరంలోని కిడ్స్‌కేర్ పిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ తరువాత వైద్యులు కాలం చెల్లిన ఇంజక్షన్ ఇవ్వడంతో తమ బాబు మృతి చెందాడని దీక్షిత్ తల్లిదండ్రులు కలెక్టర్‌తోపాటు ఒకటోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజానాదేవి ఆధ్వర్యంలో వైద్యులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ చేయించాలని కోరడంతోపాటు తాము రూపొందించిన నివేదికను అప్పటి డీఎంహెచ్‌వో ద్వారా కలెక్టర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వైద్యులతో సమగ్ర విచారణ చేయించి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సుమారు నెలరోజులవుతున్నా విచారణ దిశగా జీజీహెచ్ వైద్యుల బృందం ముందుకు వెళ్లలేదు. కలెక్టర్ ఆదేశించినా వైద్యాధికారులు అలసత్వం ప్రదర్శించడానికి కారణాలు ఏమిటని మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులతోపాటు పలువురు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్ దృష్టి సారిస్తేనే..

ప్రైవేట్ ఆస్పత్రులపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తేనే ప్రజలకు సరైన వైద్యం అందడంతోపాటు వ్యవస్థ గాడిలో పడుతుందని ప్రజలు అంటున్నారు. కిడ్స్‌కేర్ ఆస్పత్రి ఘటనపై విచారణకు ఆదేశించినా ఇప్పటికీ అధికారులు నివేదిక ఇవ్వకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ఫైన్‌లతో సరి..

నగరంలోని బోధన్ రోడ్డులో ఉన్న షాహిన్ ఆస్పత్రిలో ఈ ఏడాది మేలో వైద్యం వికటించి గర్భిణీకి తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారితోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి డీఎంహెచ్‌వో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేయించారు. అయితే ఆస్పత్రి నిర్వాహకులకు కేవలం రూ.10వేల ఫైన్ వేసి చేతులు దులుపుకున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో స్పై కెమెరాలు ఏర్పాటు చేసి రోగుల వీడియోలు రికార్డు చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రోగుల వీడియోలను రికార్డు చేసిన ప్రశాంత్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే స్కానింగ్ సెంటర్‌కు మాత్రం రూ.10వేల ఫైన్ వేసి వదిలేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-2 పరీక్ష

- మొదటిరోజు భారీ సంఖ్యలో అభ్యర్థుల గైర్హాజరు
- రెండు సెషన్‌లలో పరీక్షరాయని 10 వేల మంది చొప్పున అభ్యర్థులు



గిరిరాజ్ కళాశాల సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హనుమంతు



ఆల్ఫోర్స్ కళాశాల సెంటర్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్‌–2 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 63 సెంటర్‌లలో ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మొత్తం 19,855 మంది అభ్యర్థులకుగాను ఉదయం 9070 మంది హాజరుకాగా, 10785 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్‌కు 9020 మంది అభ్యర్థులు హాజరుకాగా, 10,835 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారయ్యారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థుల సంఖ్యతో పోలిస్తే గైర్హాజరైన వారి సంఖ్యే ఎక్కువ. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షాకేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. రెండురోజులపాటు కొనసాగనున్న నాలుగు సెషన్‌ల పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు.

వెనుదిరిగిన అభ్యర్థులు

కంఠేశ్వర్ లోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల సెంటర్‌కు ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని పరీక్షకు అనుమతించలేదు. అలాగే గిరిరాజ్ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన ఇద్దరు అభ్యర్థులను లోనికి అనుమతించలేదు.

పరీక్షాకేంద్రాల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గ్రూప్‌–2 పరీక్షా కేంద్రాలను ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదివారం ఉదయం పరిశీలించారు. సెంటర్ల వద్ద విధులు నిర్వర్తించిన సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. 63 పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రశాంతంగా పరీక్ష కొనసాగుతోందని ఆమె తెలిపారు. ఆమెవెంట డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, డీసీపీ(ఏఆర్) శంకర్ నాయక్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు. మధ్యాహ్నం పరీక్షాకేంద్రాలను డీసీపీ బస్వారెడ్డి పరిశీలించారు.

క్లుప్తంగా

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మోపాల్‌: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని డీఈవో అశోక్‌ అన్నారు. మోపాల్‌ శివారులోని ప్రెసిడెన్సీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 'స్ప్రౌట్స్‌ ద కెరీర్‌ ఫెయిర్‌' కార్యక్రమాన్ని డీఈవో అశోక్‌ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తమ పిల్లల అభిరుచిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలికితీయాలన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలని సూచించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పవన కుమార్‌, మహేశ్‌, సురేశ్‌, రణ్‌, రవి కిరణ్‌, శశాంక్‌ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు జాతీయ అవార్డు



రెంజల్‌: బహుజన సాహిత్య అకాడమీ 2024 సంవత్సరానికి గాను మండలంలోని సాటాపూర్‌ సర్పంచ్‌ ఎఖార్‌పాషను ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసింది. ఆదివారం ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్‌ ఆడిటోరియంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్‌ కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రమనియన్‌ చేతుల మీదుగా ఉత్తమ సర్పంచ్‌ అవార్డును అందుకున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉద్యమకారులు, సంఘసేవకులు, కవులు, కళాకారులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అవార్డులు అందిస్తోందని ఎఖార్‌పాష పేర్కొన్నారు. దేశంలోని 27 రాష్ట్రాల నుంచి సుమారుగా వెయ్యి మంది డెలిగేట్స్‌ను ఎంపిక చేసి అవార్డులను అందించారని వివరించారు.

17 నుంచి జిల్లా స్థాయి సీఎం కప్‌ పోటీలు

కామారెడ్డి అర్బన్‌: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈ నెల 17 నుంచి ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా క్రీడాకారులకు సీఎం కప్‌ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న హ్యాండ్‌బాల్‌ జూనియర్‌ విభాగంలో (బాలురు, బాలికలు), 20న హాకీ (సీనియర్‌ మెన్‌), 21న తైక్వాండో మార్షల్‌ ఆర్ట్స్‌ జూనియర్‌ విభాగంలో ఉంటాయని అన్నారు. క్రీడాకారులు ఆధార్‌ కార్డు, జన్మ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

బిచ్కుంద: మండల కేంద్రంలో సోమవారం మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు సాయిని అశోక్‌ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జుక్కల్‌ నియోజకవర్గంలోని మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా సమ్మేళన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

దాడిలో యువకుడి మృతి

ఖలీల్‌వాడి: బైక్‌ పార్కింగ్‌ విషయంలో చోటు చేసుకున్న గొడవలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని గోశాల గేట్‌ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటో టౌన్‌ పరిధిలోని గోశాల గేటు వద్ద ఆదివారం రాత్రి పలువురు యువకుల మధ్య బైక్‌ పార్కింగ్‌ విషయంలో గొడవ జరిగింది. ఒకరికిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో గైక్వాడ్‌ చంద్రకాంత్‌(22) మురికి కాలువలో పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ హెచ్‌ వో పేర్కొన్నారు.

అందరివాడు సంతమల్లన్న

- సోమవారం జాతర, మంగళవారం నైవేద్యాలు
- అంక్సాపూర్‌ జాతరకు సర్వం సిద్ధం



జాతరకు ముస్తాబైన ఆలయం



గర్భగుడిలో కొలువైన ఉత్సవమూర్తి

వేల్పూర్‌: మండలంలోని అంక్సాపూర్‌ సంతమల్లన్న జాతరకు స్థానిక వీడీసీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఆర్మూర్‌ సబ్‌ డివిజన్‌లో భీమ్‌గల్‌ శ్రీ మన్నిం బాచలస్వామి జాతర తర్వాత రెండో పెద్ద జాతరగా పేరు పొందింది. జాతర కోసం ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. గ్రామస్తులతో పాటు వేలాది భక్తులకు ఆరాధ్యదైవమైన సంతమల్లన్న జాతర ప్రతి ఏడాది సుబ్రహ్మణ్య షష్టి తర్వాత వచ్చే రెండో సోమవారం జరుగుతుంది. సబ్‌డివిజన్‌ మండలాల ప్రజలే కాకుండా ఇతర జిల్లాల భక్తులు ఏడాది పాటు గా సంతమల్లన్నను కొలుస్తా రు. ప్రతి ఏటా శ్రావణమాసంలో సంతమల్లన్న దీక్ష లు పాటిస్తారు. పసుపు, ఇతర పంటలకు ప్రసిద్ధిగాంచిన అంక్సాపూర్‌ గ్రామస్తులు తమ పంటలను సంతమల్లన్న అనుగ్రహం వల్లే పండుతాయని విశ్వసిస్తారు. ఏడాదిలో ఎన్ని పండుగలు వచ్చినా సంతమల్లన్న జాతరనే మొదటి పండుగగా భావిస్తారు.

పురాతన కాలంలో దొరికిన విగ్రహం

పురాతన కాలంలో గ్రామస్తులు భూమి దున్నుతుండగా సంతమల్లన్న విగ్రహం దొరికింది. దీంతో పక్కనే ఉన్న గుట్టపై ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి సంత మల్లన్నగా పూజిస్తున్నారు. గుట్టపై భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. గుట్టపైకి వెళ్లేందుకు మెట్ల మార్గంతో పాటు, వెనుక వైపు ఘాట్‌రోడ్డు ఉంది. గుట్ట చుట్టూ రథోత్సవానికి సీసీ రోడ్డు నిర్మించారు. జాతరకు నలు దిక్కుల నుంచి వచ్చే భక్తులు సునాయసంగా గుట్టపైకి చేరడానికి రూ. రెండు కోట్ల ఇరవైలక్షలతో సుమారు 2 కిలోమీటర్ల బైపాస్‌ తారురోడ్డు నిర్మించారు.

జాతర కార్యక్రమాలు

వారం రోజుల ముందు నుంచి సంతమల్లన్న జాతర కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఉత్సవ మూర్తులతో రెండు రోజుల పాటు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శుక్రవారం విగ్రహాలను పల్లకీలో కాలినడకన తడ్‌పాకల గంగ స్నానానికి తీసుకెళ్లారు. గంగస్నానం తర్వాత తిరిగి కాలినడకన శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్నారు. ఆదివారం రథాన్ని పూలతొట్లెలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం డప్పు వాయిద్యాలతో రథాన్ని గుట్టవద్దకు చేర్చారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు సంతమల్లన్నస్వామికి మాండలమ్మ, గొల్లకేతమ్మతో కల్యాణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం సంప్రదాయ పూజలు, బలిహరణం తర్వాత భాజాభజంత్రీలు, డప్పులతో గుట్ట చుట్టూ మూడు సార్లు రథోత్సవం చేపడతారు. మంగళవారం భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు. దీంతో జాతర కార్యక్రమాలు ముగుస్తాయి. అనంతరం గ్రామంలో జాతర కొనసాగుతుంది.

డిగ్రీ కళాశాలలకు నిధుల కొరత

- విడుదల కాని విద్యార్థుల ట్యూషన్‌ ఫీజు
- ఒక్కో కళాశాలకు రూ.6లక్షలకు పైగా బకాయిలు



మోర్తాడ్‌లోని డిగ్రీ కళాశాల భవనం

మోర్తాడ్‌: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యార్థులకు అందాల్సిన ట్యూషన్‌ ఫీజుల నిధులు గత రెండేళ్ల నుంచి విడుదల కావడం లేదు. దీంతో అధ్యాపకులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో మోర్తాడ్‌, భీమ్‌గల్‌, ధర్పల్లి, ఆర్మూర్‌, బోధన్‌, నిజామాబాద్‌లో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. గత ఏడాది బాల్కొండలో డిగ్రీ కళాశాలను ఆరంభించారు. డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.1800, బీఎస్సీ మ్యాథ్స్‌, సైన్స్‌, కంప్యూటర్‌ సైన్స్‌ విద్యార్థులకు రూ.2వేల చొప్పున ప్రభుత్వం ట్యూషన్‌ ఫీజును కళాశాలలకు చెల్లిస్తుంది. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వారి ఖాతాల్లో జమ చేసినట్లుగానే కళాశాల ఖాతాల్లోకి ట్యూషన్‌ ఫీజును ప్రభుత్వం విడుదల చేస్తుంది. గత ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒక్కో కళాశాలకు ఏడాదికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ట్యూషన్‌ ఫీజు రూపంలో నిధులు జమ కావాల్సి ఉంది. నిజామాబాద్‌లోని గిరిరాజ్‌ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 1,800 వరకు ఉండటంతో ఈ కళాశాలకు ఎక్కువ మొత్తంలో నిధులు విడుదల కావాల్సి ఉంది. మిగిలిన కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య 300 లోపు ఉండటంతో ట్యూషన్‌ ఫీజు తక్కువ జమ కానుంది. ఈ సొమ్ముతోనే డిగ్రీ కళాశాలలు యూనివర్సిటీకి చెల్లించాల్సిన అఫ్లియేషన్‌ ఫీజు, కామన్‌ సర్వీసు ఫీజు, ఇన్‌స్పెక్షన్‌ ఫీజు, కొత్త కోర్సులను ప్రవేశపెడితే అందుకు ఫీజును ట్యూషన్‌ ఫీజు నిధుల నుంచి వెచ్చిస్తారు. అలాగే కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడం, మహిళా సంఘాల ద్వారా నియమించుకున్న అటెండర్‌కు వేతనం చెల్లించడం ఇలా ఎన్నో ఖర్చులకు ట్యూషన్‌ ఫీజు నిధులను వినియోగిస్తారు. రెండేళ్ల నుంచి ఒక్కో కళాశాలకు రూ.6లక్షలకు పైగా నిధులు విడుదల కావాల్సి ఉంది. గత ప్రభుత్వంలా కాకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

నిధులు లేక ఇబ్బందిగా ఉంది

డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం నిధులను విడుదల చేయడం లేదు. దీంతో ఇబ్బందిగా ఉంది. రెండేళ్ల నుంచి నిధులు విడుదల కావడం లేదు. ట్యూషన్‌ ఫీజు నిధులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం కేటాయించాలి. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో సౌకర్యాలను కల్పించాల్సి ఉంది.

– డాక్టర్‌ పెద్దన్న, ప్రిన్సిపాల్‌, మోర్తాడ్‌

ఆల్‌ పెన్షనర్స్‌ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న రిటైర్డ్‌ ఉద్యోగులు

నిజామాబాద్‌ నాగారం: ఆల్‌ పెన్షనర్స్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలను పురుషులకు మల్లు స్వరాజ్యం ట్రస్ట్‌ భవన్‌లో, మహిళలకు సీఎస్‌ఐ చర్చి కాంపౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. పెన్షనర్స్‌ దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించినట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు శాస్త్రుల దత్తాత్రేయరావు తెలిపారు. మహిళల ఆటల పోటీలను ఉపాధి శిక్షణ శాఖ మాజీ జిల్లా అధికారి డి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. స్కిల్‌ గేమ్స్‌ అయిన ఇండియన్‌ టాగ్‌, బకెట్‌ అండ్‌ బాల్‌, వాటర్‌ కాయిన్‌, పాసింగ్‌ బాల్‌, లూడో, ఫాస్ట్‌ వాకింగ్‌, చెస్‌, తదితర పోటీలను నిర్వహించారు. మహిళలలో క్రీస్తు కుమారి, స్వర్ణలత, పద్మలత, పద్మ కుమారి, పురుషుల్లో హమీరుద్దీన్‌, లక్ష్మీనారాయణ, సాయిరెడ్డి, అంసోజీ రావు, మేఘారాం, మధుసూదన్‌, రాధాకృష్ణ తదితరులు గెలుపొందారు. కార్యక్రమాల్లో రిటైర్డ్‌ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



మంజుల(ఫైల్‌)

తాడ్వాయి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ యువతి మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలం చిట్యాలలో చోటు చేసుకుంది.ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రుల మంజుల(26)జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది.కొన్ని రోజులుగా ఆమె కడుపు నొప్పితో పాటు దంతాల సమస్యలతో బాధపడుతోంది. శనివారం ఉదయం ఇంటి నుంచి విధులు నిర్వహించే ఆస్పత్రికి వెళ్లిన ఆమె మధ్యాహ్నం అనారోగ్య సమస్యలతో ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి మంజుల ఉరేసుకొని కనిపించింది. తండ్రి కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సైపేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరు..

నవీపేట: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నవీపేట మండలంలోని మట్టయ్యఫారంలో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్‌ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేదావత్‌ పీర్‌చంద్‌(35) ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ సరైన ఉపాధి దొరకక పోవడంతో ఐదేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. నాటి నుంచి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడేవాడు. శనివారం రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



చిన్న సాయిలు మృతదేహం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్ల గ్రామ చెరువులో శనివారం గల్లంతైన కోటగిరి మండలం కొత్తపల్లికి చెందిన గేదెల కాపరి చిన్నసాయిలు (40) మృతదేహం ఆదివారం లభ్యమైంది. స్థానిక జాలరుల చేత గాలింపు చర్యలు చేపట్టగా నీట మునిగిన చోటే మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై రజినీకాంత్‌ పేర్కొన్నారు.

టేకు దుంగల పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్‌ పరిధిలోని వెల్లుట్లలో అక్రమంగా దాచి ఉంచిన టేకు దుంగలను కామారెడ్డి అటవీశాఖ ప్రత్యేక బృందం అధికారులు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎఫ్‌డీవో రామకృష్ణ ఆదివారం తెలిపారు. వెల్లుట్లలో అక్రమంగా టేకు దుంగలు దాచి ఉంచారన్న సమాచారం మేరకు కామారెడ్డి బృందం దాడులు చేయగా గ్రామంలోని పైడాకుల నర్సింలు అనే వ్యక్తి ఇంట్లో దాచి ఉంచిన 50 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. నర్సింలుపై అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీవో పేర్కొన్నారు.

కల్లెడిలో చోరీ



మాక్లూర్‌: మండంలోని కల్లెడి గ్రామంలో చోరీ జరిగినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భజనమండలి గంగుబాయి శనివారం రాత్రి ఇంటికితాళం వేసి గ్రామ శివారులోని ఆశ్రమానికి భజన కోసం వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించింది. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ. 16 వేల నగదు, తులంన్నర వెండి చోరీ గురైనట్లు బాధితురాలు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎడపల్లిలో బైక్‌..

ఎడపల్లి: మండల కేంద్రంలో ఓ బైక్‌ చోరీకి గురైనట్లు ఎస్సై వంశీచందర్‌ రెడ్డి తెలిపారు. ఎస్సై ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌ మండలం బర్దిపూర్‌ గ్రామానికి చెందిన పెద్దోళ్ల హన్మండ్లు ఎడపల్లి మండల కేంద్రంలోని ఆకుల శ్రీనివాస్‌ పొలంలో పని నిమిత్తం వచ్చాడు. అతను తన బైక్‌ను గురుకుల పాఠశాల సమీపంలో ఉదయం ఉంచాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా బైక్‌ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రారంభమైన శబరిమాత ఉత్సవాలు

- కనుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం
- తరలివచ్చిన భక్తులు



ఆశ్రమంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం 54వ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 4 గంటలకు సుప్రభాత ధ్యానం, గురు గీత, గురుచరిత పారాయణం, గోమాత, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలను ఆశ్రమ నిర్వాహకులు చేపట్టారు. ఆయా జిల్లాల నుంచి 300మంది భక్తులు ఆశ్రమానికి కాలినడకన వచ్చారు. ఉదయం ఆశ్రమం నుంచి భక్తులు భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేపట్టి భిక్షాటన చేశారు. మధ్యాహ్నం 12గంటలకు ఆశ్రమంలో వేద పండితులు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహాత్ములు తమ సందేశాన్ని ఇచ్చారు. శ్రీ సీతారామాంజనేయ సంవాద మహాగ్రంథ పారాయణం, శ్రీగురుగీత, గురచరిత పారాయణం తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం దత్తాత్రేయ జయంతి సందర్భంగా డోలారోహణ కార్యక్రమం, రాత్రి ప్రధాన రహదారిపై రథోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జాము వరకు భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, జానపదగేయాలు, నృత్యాలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆర్టీసీ అధికారులు ఆశ్రమం వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా అరకిలోమీటరు పొడవునా రకరకాల దుకాణాలు వెలిశాయి. సీఐ సంతోష్‌, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు, గాంధారి ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆశ్రమ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కల్యాణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి



ఖలీల్‌వాడి: సభలు, సమావేశాలకు ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకువాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదివారం పేర్కొన్నారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్‌ ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎలాంటి విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయరాదని, ఇలా చేస్తే దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. రెసిడెన్షియల్‌ స్థలం, కమర్షియల్‌ స్థలాల్లో రాత్రివేళ్లలో 55 డెసిబెల్స్‌ సౌండ్‌ వాడాలని రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల సౌండ్‌ సిస్టం పూర్తిగా నిషేధమన్నారు. దీనికి పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలని పేర్కొన్నారు. మాల్స్‌, సినిమా థియేటర్స్‌, హోటల్స్‌, ఎగ్జిబిషన్‌, బిజినెస్‌ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రోన్ల వాడకంతో ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్నందున నియంత్రణ చర్యలు తీసుకోనున్నట్లు పేఉర్కొన్నారు. డ్రోన్ల వాడకంపై పోలీసు, ఏవియేషన్‌ అధికారుల నుంచి క్లియరెన్స్‌ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలు గల్ఫ్‌ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముళ్ల పొదల్లో మోడల్‌ రూం..!

చారిత్రక సంపద కనుమరుగు



ముళ్ల పొదల్లో ఉన్న మోడల్‌ రూం

బాల్కొండ: ప్రాజెక్ట్‌ నిర్మాణ కాలంలో తీసిన పటాలను పర్యాటకులకు తిలకించే విధంగా ఏర్పాటు చేసిన మోడల్‌ రూం ముళ్ల పొదల్లో మగ్గుతోంది. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ఆనకట్ట దిగువన ప్రాజెక్ట్‌ నిర్మాణ కాలంలో మోడల్‌ రూంను నిర్మించారు. కానీ నిర్వహణ మరిచిపోవడంతో ముళ్ల పొదల్లో మగ్గుతోంది. ప్రాజెక్ట్‌ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్‌ నెహ్రూ మోడల్‌ రూంకు సైతం శంకుస్థాపన చేశారు. 1984లో ప్రాజెక్ట్‌లోకి భారీ వరదలు రావడంతో గోదావరిలోని 42 వరద గేట్లు ఎత్తి 16 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో నాడు మోడల్‌ రూంను ఖాళీ చేసి అందులో ఉన్న పటాలను, ప్రాజెక్ట్‌ నిర్మాణ క్రమాలను ప్రాజెక్ట్‌ గెస్ట్‌ హౌజ్‌లోని ఓ గదిలో భద్రపరిచారు. అక్కడా గది శిథిలావస్థకు చేరడంతో ప్రాజెక్ట్‌ హౌజ్‌లోని ఓ గదిలో పెట్టారు. నాటి నుంచి పర్యాటకులకు చారిత్రక వివరాలు తెలియకుండానే మగ్గుతున్నాయి. ప్రస్తుతం మోడల్‌ రూం చుట్టూ ముళ్ల పొదలతో నిండి పోయింది. వర్షం కురిస్తే తడిసి ముద్దవుతోంది. స్వల్ప మరమ్మతులు చేపడితే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ప్రాజెక్ట్‌ పటాలను తీసుకొచ్చి మోడల్‌ రూంలో భద్ర పరిస్తే పర్యాటకులకు, భావితరాలకు ప్రాజెక్ట్‌ గురించి తెలిసే అవకాశం ఉంది. ఇకనైనా ప్రాజెక్ట్‌ ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతులు చేపడుతాం

ప్రాజెక్ట్‌ వద్ద ఉన్న మోడల్‌ రూం మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. మోడల్‌ రూం చుట్టూ ఉన్న ముళ్ల పొదలను వెంటనే తొలగిస్తాం. ప్రాజెక్ట్‌ నిర్మాణ కాల పటాలను పర్యాటకులకు తిలకించే విధంగా ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

– అక్తర్‌, ఏఈఈ, ఎస్సారెస్పీ

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌ శివారులో జాతీయ రహదారిపై బైక్‌ను డీసీఎం వ్యాన్‌ ఢీకొన్న ఘటనలో నిర్మల్‌ జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ అద్నాన్‌(20) మృతి చెందాడు. ఎస్సై నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన అద్నాన్‌ తన మిత్రుడు షేక్‌ ఫైసల్‌తో కలిసి నిజామబాద్‌ జిల్లా కేంద్రంలో పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా చిట్టాపూర్‌ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాను ఢీకొన్నది. ఈ ఘటనలో అద్నాన్‌ తలకు తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. షేక్‌ ఫైసల్‌ గాయాలతో బయట పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరు..



సోనాజీ మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లో సోనాజీ అలియాస్‌ సోమాజీ గాంధీ శామల్‌వాడ్‌(60) కాలువ పడి మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మహారా ష్ట్రలోని నాందేడ్‌ జి ల్లా షిబ్దారా గ్రామానికి చెందిన సోనాజీ పెర్కిట్‌లో కూలీ పని చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. శనివారం సాయంత్రం పెర్కిట్‌లో ని మట్టు కాలువలో చేపలు పడుతుండగా కాలువలో పడి మృతిచెందాడు. మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు..

నిజాంసాగర్‌: మండల శివారులోని పెద్దపూల్‌ బ్రిడ్జి వద్ద ఆదివారం కుర్మ భూమవ్వ(70) అనే మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు. మండల కేంద్రానికి చెందని భూమవ్వ ప్రతి రోజు ఇంటి నుంచి వెళ్లి రాత్రి వచ్చేది. ఈ నెల 10న అలాగే ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. పెద్దపూల్‌ బ్రిడ్జి పక్కన మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తల్లీ కుమార్తె అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని భవానీరోడ్‌లో నివాసం ఉండే తల్లీ కుమార్తె అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. కాలనీలో ఉండే చాట్ల స్వరూపకు ఆరేళ్ల క్రితం మరో కాలనీకి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవలతో కొంత కాలంగా ఆమె తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈ నెల 4న తన నాలుగేళ్ల కుమార్తెను తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. స్వరూప తల్లి సిద్ధవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.